# కూలీలకు పని కల్పించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి
- ఉపాధిహామీ పనులపై అధికారులతో సమీక్షా సమావేశం

ఆసిఫాబాద్ టౌన్,మార్చి 21:మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు పూర్తి స్థాయిలో పని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖాధికారి భాస్కర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్‌తో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఏపీఎంలు, సీడీపీవోలతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల హాజరు శాతాన్ని పెంచాలని, దినసరి వేతనం పెంపొందించేందుకు నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనులను నిర్దేశించిన సమయానికి పూర్తి చేసే విధంగా ప్రణాళికాబద్ధంగా పని చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ వాటిక నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణ యూనిట్లను ఏర్పాటు చేసి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇక్కడ అధికారులు ఉన్నారు.

# విధులపై పూర్తి అవగాహన ఉండాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- పార్లమెంట్ ఎన్నికలపై అవగాహన


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

కాగజ్‌నగర్, మార్చి 21:పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్, పోలీసు, నోడల్ అధికారులకు విధులపై పూర్తి అవగాహన ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకటేశ్ దోత్రే అన్నారు. కాగజ్‌నగర్ మండలం వంజీరి రైతు వేదికలో గురువారం పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సిర్పూర్ నియోజకవర్గంలో 320, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 356 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సెక్టోరల్ అధికారులకు పోలింగ్ కేంద్రాలు కేటాయించామన్నారు. సెక్టోరల్ అధికారులకు అందించిన రూట్ మ్యాప్ ప్రకారం విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రీ పోల్, పోల్, పోస్ట్ పోల్ విడుతలుగా ఎన్నికలు నిర్వహిస్తారన్నారు. పోలింగ్ ప్రారంభానికి ముందు మాక్ పోల్ నిర్వహించాలని సూచించారు. మాక్ పోల్ నిర్వహించడానికి అధికారులు పూర్తి ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్‌కు ముందు రోజు ప్రతి సెక్టోరల్ అధికారి తన పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఆయా ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో కేటాయించిన ఎన్నికల సామగ్రి టేబుళ్ల అమరిక, పోలింగ్ కేంద్రాలకు వచ్చే ప్రజలకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈవీఎంలలో ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించడానికి కృషి చేయాలని తెలిపారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించాలని చెప్పారు. ఓటింగ్ ప్రక్రియను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తారని, ప్రతి పోలింగ్ కేంద్రానికి సరిపడా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లతో పాటు అదనంగా అందిస్తారని చెప్పారు. నోడల్ అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, మ్యాన్ పవర్, కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీ, స్వీప్, శాంతి భద్రతల పరిరక్షణ, ఈవీఎం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, సీ- విజిల్, ఖర్చుల పర్యవేక్షణ, తదితర అంశాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల అధికారులు సమన్వయంతో పని చేసి ఎన్నికలు సజావుగా సాగేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, కాగజ్‌నగర్ ఆర్డీవో సురేశ్, సెక్టోరల్, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కెరమెరి, మార్చి 21: మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో పాత ఫీడర్‌లను తొలగించి కొత్త ఫీడర్‌లను ఏర్పాటు చేస్తున్నందున ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## గని ప్రమాదంపై విచారణ చేపట్టాలి

శ్రీరాంపూర్, మార్చి 21 : శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఆర్పీ 1గనిలో జరిగిన ప్రమాదంపై యాజమాన్యం విచారణ జరిపించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు టీ రాజారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఆర్పీ 1గనిని సందర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. హ్యామర్‌మెన్(రూఫ్ ప్లేసర్) కార్మికుడు పనిచేస్తున్న క్రమంలో ప్రమాదం జరిగి తన కాళ్లు పుల్లీలో ఇరుక్కుని విరిగిపోయాయని పేర్కొన్నారు. పుల్లీపై ఉండాల్సిన సేఫ్టీ కవర్ లేకపోవడంతో ప్రమాదం జరిగిందన్నారు. కనీసం గనిలో ఫస్ట్ ఎయిడ్ కిట్టుల కూడా అందుబాటులో ఉంచడం లేదన్నారు. కార్మికుడు కాలు కోల్పోతే ఒక సిమెంటు సంచిలో ఆదికూడా కనీసం కాటన్ కూడా పెట్టకుండా తీసుకెళ్లారని ఆరోపించారు. ఫస్ట్ ఎయిడెడ్ స్టేషన్లు పేరుకు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. ప్రమాదంపై డీజీఎంఎస్ అధికారులు పూర్తిగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ ఏరియా అధ్యక్షులు గొల్ల బాలాజీ, కార్యదర్శి శ్రీనివాస్, చంద్రశేఖర్, సుధాకర్, సదానందం, సాయి, మహేశ్ పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీసీసీ నస్పూర్, మార్చి 21: శ్రీరాంపూర్ ఏరియాలోని సీహెచ్‌పీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఐఎన్టీయూసీ నాయకులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఏరియా కార్యదర్శి అన్‌రెడ్డి సమ్మిరెడ్డి, పిట్ కార్యదర్శి లతీఫ్, నాయకులు వెంకన్న, లక్ష్మణ్, కోల నర్సయ్య, రమేశ్, ఫారూక్, రాజ్‌కుమార్, సదానందం, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు

## కార్మికుడి కుటుంబానికి పరిహారం అందజేత

కాసిపేట, మార్చి 21 : మందమర్రి ఏరియాలోని కాసిపేట 2 ఇంక్లైన్ గనికి చెందిన సీనియర్ మైనింగ్ సర్దార్ మచ్చ రమేశ్ గత జనవరిలో గని ప్రమాదంలో గాయపడి మృతి చెందాడు. అతని కుటుంబానికి రావాల్సిన ఎక్స్‌గ్రేషియా, స్పెషల్ ఎక్స్‌గ్రేషియా బెనిఫిట్స్ రూ.15,90,000 చెక్కును గని మేనేజర్ లక్ష్మీనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ చేతుల మీదుగా అందించారు. కార్మికుడి కుటుంబానికి ఉద్యోగం, పరిహారం ఇవ్వాలని ధర్నా చేయడంతో యాజమాన్యం అంగీకరించినట్లు ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ వివరించారు. ఈ కార్యక్రమంలో గని వెల్ఫేర్ ఆఫీసర్ భార్గవ్, సర్వే ఆఫీసర్ ప్రకాశ్, పిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఐటీఐ వెల్డర్ నియామకానికి నోటిఫికేషన్ ఇవ్వాలి

శ్రీరాంపూర్, మార్చి 21 : సింగరేణిలో ఖాళీగా ఉన్న ఐటీఐ వెల్డర్ ట్రేడ్స్‌మెన్ నియామకానికి యాజమాన్యం వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని కోరుతూ గురువారం శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డికి ఐటీఐ వెల్డర్ అభ్యర్థులు వినతి పత్రం అందించారు. వెల్డర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని వెల్డర్ సీపెల్లి రాజు కోరారు.

# ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



పెంచికల్ పేట్: మండల ప్రధాన కార్యకర్తలతో ఎమ్మెల్సీ దండే విఠల్

- ఎమ్మెల్సీ దండే విఠల్
- బెజ్జూర్‌లో పర్యటన
- పెంచికల్ పేట్‌లో మండల ప్రధాన కార్యకర్తలతో సమావేశం

బెజ్జూర్, మార్చి 21: గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం బెజ్జూర్‌తో పాటు కొరెతగూడ, సులుగుపల్లి, కుకుడ తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకుపోయారు. మండల కేంద్రంలోని వైద్యశాలలో తగినంత సిబ్బంది లేక వైద్యం సరిగా అందడం లేదని, వైద్యంకోసం మంచిర్యాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈవిషయంపై ఎమ్మెల్సీ స్పందిస్తూ వైద్యశాలలో సిబ్బందిని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపునకు కార్యకర్తలు, నాయకులు కృషిచేయాలని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు, నాయకులు అధైర్యపడకూడదని, పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పద్రం పుష్పలత, నాయకులు సామల రాజన్న, ఖాజాశమీయొద్దీన్, శ్యాంరావు, సాదిక్, ఖాజామియా, అమృత, విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలి

పెంచికల్‌పేట్,మార్చి21 ఉమ్మడి ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జాగృతి మాజీ అధ్యక్షుడు నౌనురి శ్రీనివాస్ నివాసంలో మండల ప్రధాన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే మండల స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీని శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రమేశ్, నాయకులు బిట్టు శ్రీనివాస్, రాచకొండ కృష్ణ, లహన్ రాజ్, రమేశ్, ఉమామహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇటుకలపాడు ప్లాంటేషన్ సందర్శన



ఇటుకలపాడు అటవీ ప్రాంతంలోని ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న అటవీశాఖ ఉన్నతాధికారులు

సిర్పూర్(టీ), మార్చి 21 : సిర్పూర్(టీ) పరిధిలోని ఇటుకలపాడు అటవీ ప్లాంటేషన్‌ను ఫారెస్ట్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ జనరల్ కైలాస్ భీమ్‌రావ్, జిల్లా అటవీ శాఖాధికారి నీరజ్‌కుమార్ టిబ్రెవాల్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంతంలోని ప్లాంటేషన్, మాచాన్‌లను పరిశీలించారు. అదే విధంగా సిర్పూర్(టీ) అటవీ ప్రాముఖ్యత గురించి అధికారులు ఉన్నాతాధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటుకలపాడులోని డీ గ్రేడెడ్ భూముల్లో మొక్కలు నాటాలని, అటవీ సంరక్షణ మనందరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ అటవీ సంరక్షణకు ృషి చేయాలని సూచించారు. ఆయన వెంట సిర్పూర్(టీ) అటవీ శాఖ రేంజ్ అధికారి పూర్ణచందర్ రావు, ఫారెస్ట్ సెక్షన్ అధికారి మోహన్‌రావు, బీట్ అధికారులు షాహిద్, నరేశ్, నవీన, సిబ్బంది ఉన్నారు.

## ఫేక్ సర్టిఫికెట్‌తో ఉద్యోగం పొందిన లెక్చరర్ తొలగింపు

బెజ్జూర్/ ఆసిఫాబాద్ టౌన్, మార్చి 21: ఫేక్ సర్టిఫికెట్లతో కాంట్రాక్టు ఉద్యోగాన్ని రెగ్యులరైజ్ చేయించుకున్న బెజ్జూర్ జూనియర్ కళాశాల గణిత అధ్యాపకుడు కలవేణి నాగరాజును ఉద్యోగంలో నుంచి తొలగిస్తూ ఆర్జేడీ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత మే నెలలో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా రెగ్యులర్ అయిన నాగరాజుపై ఫిర్యాదు రాగా విచారణ అనంతరం ఉద్యోగంలో నుంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి దగ్ధం

కౌటాల, మార్చి 21: మండల కేంద్రంలోని మోర్లె పోచుబాయి ఇంట్లో గురువారం ఉదయం షార్ట్ సర్క్యూట్ తో సామగ్రి కాలిపోయింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం ఇంట్లోని కరెంట్ తీగల్లో మంటలు రావడంతో టీవీ, ఫ్యాన్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు, బట్టలు, సామగ్రితో పాటు రూ.50 వేలు, నగలు కాలిపోయాయి.

## ఆర్టీసీ సిబ్బందికి నిమ్మరసం ప్యాకెట్ల పంపిణీ



కార్మికులకు నిమ్మరసం ప్యాకెట్లను అందజేస్తున్న ఆర్టీసీ డీఎం విశ్వనాథ్

ఆసిఫాబాద్, మార్చి 21: ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు గురువారం ఆసిఫాబాద్ డిపో ఆవరణలో డీఎం విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, కార్మికులకు నిమ్మరసం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ వేసవిలో ఉద్యోగులు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందడం కోసం నిమ్మరసం ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. వేసవి ముగిసే వరకు ప్రతి రోజు ఈ ప్యాకెట్లు అందిస్తారమని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీఐ సరియ, టీఐ భారతి, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED

**CHANGE OF NAME**

★I, CHEERLA TIRUPATI, R/o. 23-225/1-117, Road No. 2, Surya Nagar, Chunnambatti Wada, Mancherial, TS. Changed My Name as CHEERLA THIRUPATHI REDDY, S/o. Malla Reddy.
NT-328435

★I, CHEERLA JYOTHI, R/o. 23-225/1-117, Road No. 2, Surya Nagar, Chunnambatti Wada, Mancherial, TS. Changed My Name as CHEERLA LALITHA, W/o. Thirupathi Reddy.
NT-328435

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

# తృణధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

- గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి
- పోషణ పక్షోత్సవాల్లో అవగాహన



పెంచికల్ పేట్: మోర్లిగూడ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం చేస్తున్న సూపర్‌వైజర్ హసీనా, అంగన్‌వాడీ టీచర్లు, దహెగాం: పౌష్టికాహారం గురించి వివరిస్తున్న కార్యదర్శి రోహిదాసు



కాగజ్‌నగర్: చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి

పెంచికల్‌పేట్, మార్చి 21 గర్భిణులు, బాలింతలు మొలకెత్తిన తృణధాన్యాలను తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా సూచించారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం మోర్లిగూడ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పదార్థాలతో తయారుచేసిన తినుబండారాలు, కూరగాయలు, మొలకెత్తిన గింజలతో డెమో గ్యాలరీని ఏర్పాటు చేశారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు బోధించాల్సిన ప్రీ ప్రైమరీ విద్యపై కృత్యాధారణ బోధన చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈశ్వరీబాయ్, పంచాయతీ కార్యదర్శి శాంతయ్య, అంగన్వాడి టీచర్లు, ఆశ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### పౌష్టికాహారంపై అవగాహన

దహెగాం,మార్చి21: మండలంలోని పీపీ రావుకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. కూరగాయలు, పండ్లు, పిండి పదార్థాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జయప్రద,ఆరోగ్య కార్యకర్త హేమలత, పంచాయతీ కార్యదర్శి రోహిదాసు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

### పోషకాహారం తీసుకోవాలి

కాగజ్‌నగర్, మార్చి 21: పోషకాహారం తీసుకోవడంతో ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని చిలకఫకీర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం అన్నప్రాసన, సీమంతం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సిబ్బంది జమున, చైల్డ్ లైన్ ఝాన్సీ, హెల్త్ సిబ్బంది పుష్ప, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుకు అడ్డంగా ఉన్న రేకులను తొలగించండి


రోడ్డుకు అడ్డుగా ఏర్పాటు చేసిన తొలగింపు

- ఎస్పీఎం క్రీడా మైదానం ఎదుట మున్సిపల్ పాలకవర్గం, పలు పార్టీల నాయకుల ధర్నా
- గడువు ముగిసినా స్పందించరా అంటూ మండిపాటు
- మిల్లు ప్రతినిధులకు సమాచారమిచ్చి జేసీబీతో తొలగింపజేసిన కమిషనర్

కాగజ్‌నగర్, మార్చి 21 : ఎస్పీఎం యాజమాన్యం పలుచోట్ల రోడ్లకు అడ్డంగా ఏర్పాటు చేసిన రేకులను తొలగించాలని మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం, ఏఐఎంఐఎం, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎస్పీఎం క్రీడా మైదానం ఎదుట ధర్నా చేశారు. రోడ్లకు అడ్డంగా నిర్మించిన గోడలను తొలగించాలని మున్సిపల్ పాలకవర్గంతో పాటు ఆయా పార్టీల నాయకులు, ప్రజలు డిమాండ్ చేయగా, ఇటీవల బల్దియా కమిషనర్ అంజయ్య పేపర్ మిల్లు యాజమాన్యానికి నోటీసులు అందించారు. అయినా, యాజమాన్యం స్పందించకపోవడంతో ఈ నెల18న మున్సిపల్ కమిషనర్ జేబీసీ సాయంతో ప్రహరీలను కూల్చివేయించారు. తమ విలువైన సామగ్రి తీసేందుకు, ఇతరాత్ర పనుల కోసం మూడు రోజుల గడువు కోరిన మిల్లు ప్రతినిధులు.. తిరిగి ఆ స్థలాల్లోనే రేకులను అడ్డుగా ఏర్పాటు చేశారు. గురువారంతో గడువు ముగిసినా స్పందించకపోవడంతో మున్సిపల్ సభ్యులు, పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ఎస్పీఎం క్రీడా మైదానం వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. గడువు ముగిసినా రేకులు తొలగించలేదని, పేపర్ మిల్లు ప్రతినిధులపై కేసు నమోదు చేయాలని నినాదాలు చేశారు. డీఎస్పీ కరుణాకర్ పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. జడ్పీ ఇన్‌చార్జి చైర్మన్ కోనేరు కృష్ణారావు అక్కడికి చేరుకొని అధికారులతో మాట్లాడారు. చివరకు మున్సిపల్ కమిషనర్.. మిల్లు ప్రతినిధులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఆపై ఎస్పీఎం క్రీడా మైదానం ఎదుట, బాల భారతి విద్యాలయం సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన రేకులను జేసీబీతో తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిర్, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు వెన్న కిషోర్ బాబు, పాలకవర్గం సభ్యులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా సాగుతున్న 'పది' పరీక్షలు

పెంచికల్‌పేట్, మార్చి 21: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ గోపాల్ తెలిపారు. గురువారం ఇంగ్లిష్ పరీక్షకు 143 మంది విద్యార్థులకు గాను 100 శాతం హాజరైనట్లు వెల్లడించారు. విద్యార్థులకు నౌనురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మ్యాంగో జ్యూస్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ మాజీ చైర్మన్ పోచన్న, నాందేవ్, ప్రవీణ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు జ్యూస్ అందజేస్తున్న యువకులు

## పారదర్శకంగా క్వార్టర్ల కౌన్సెలింగ్


గోలేటి జీఎం కార్యాలయంలో క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఏరియా ఎస్‌వో టూ జీఎం మచ్చగిరి నరేందర్

రెబ్బెన, మార్చి 21: బెల్లంపల్లి ఏరియాలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సింగరేణి క్వార్టర్ల కౌన్సెలింగ్ పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి ఏరియా ఎస్‌వోటూజీఎం మచ్చగిరి నరేందర్ తెలిపారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో గురువారం క్వార్టర్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించి క్వార్టర్లు మంజూరు చేశారు. కార్యక్రమంలో సివిల్ ఈఈ రాజేంద్రప్రసాద్, సీనియర్ పీవో ప్రశాంత్, జూనియర్ అసిస్టెంట్ అర్చన తదితరులు పాల్గొన్నారు.